


'రోగం మనిషిని బాధించనంతకాలం కొంతవరకు తట్టుకోవచ్చేమో.

మనస్సుని బాధించడం మొదలు పెడితే తట్టుకోవటం చాలా కష్టం. ఈ రోగం తగ్గుతుందో తగ్గదోగాని. కొన్ని నమ్మకాల్ని మట్టుకు నాశనం చేస్తోంది. ఇదివరకు ఎవరేనా ఆకు పసరులు, మూలికలు మింగుతూంటే చిరాకుపడేవాణ్ణి, ఇంత మంది డాక్టర్లు ఉ:డగా ఏమిటీ పిచ్చి అని.

'ఒంట్లో ఓపిక లేకపోయినా, మనస్సు సమ్మతించక పోయినా ఏదో మినుకు మినుకుమనే ఆశ లాక్కువచ్చింది పల్లెటూరికి. అరుదుగా వచ్చే బస్సులకోసం నిరీక్షణ.కుదుపులు.... నాలుగు మైళ్ళ నడక, తను రాలేదూ ఇంతదూరం? ఎవరేనా చూస్తే ఇది పిచ్చి అనుకోరూ?'

అయిష్టమైన అనుభవం పునశ్చరణ చేసుకోగానే చిరాకు పెరిగింది.చుట్టూ బస్సుకోసం ఎదురు చూసే కళ్ళూ....సోడా అరుపులూ... ఎదురుగా హోటలు.

"సి కి కడుపులో నొప్పి తగ్గాలంటే, కాఫీ మానటం చాలా అవసరం." ఎందరో ఎన్నోసార్లు సలహా ఇచ్చారు, ఆ సలహా కాఫీ మాన్పించలేకపోగా ఆ అలవాటు ఇంకా పెంచింది. అప్పుడప్పుడు వచ్చే నొప్పికన్న అనుక్షణం దాన్ని గురించిన ఆలోచనలే

ఎక్కువ బాధిస్తున్నాయి. రోగాలతో బాధపడే వారికన్న ఆలోచనా రోగంతో బాధపడేవాడు దురదృష్టవంతుడు.

ఎదురుగా బల్లమీద కప్పులు, ఎంగిలి ప్లేట్లు. హోటలు కౌంటరు ముందున్న అతను ఏదో చూస్తున్నాడు. కప్పులు చప్పుడైతే ఇటు తిరిగి చూశాను.

చిన్న మాసిన నిక్కరు.... అంతకన్న ఆచ్ఛాదన ఇంకేమీ లేదు ఒంటిమీద. పన్నెండేళ్ళు ఉంటాయేమో. నా వేపు చూడకుండా కప్పులు, ఎంగిలిప్లేట్లు తీసుకు వెళ్ళిపోయాడు.

సప్లయరు కాఫీ తెచ్చాడు. తాగుతూ బయటికి చూశాను. ఇందాకటి కుర్రాడు గుమ్మం దగ్గిర నిలబడి బయటికి చూస్తున్నాడు. బయట వాడి వయస్సు వాళ్లే ఆడుస్తూ ఆడుకుంటున్నారు.

'వాడి మనసులో ఆ ఉద్దేశం ఉందో లేదోగాని, వాళ్ళతో కలిసి ఆడుకోటానికి వెళ్లాలని ఉన్నా వెళ్ళలేడుగా' అనిపించింది నాకు.

బాధ్యతలకు బరువులకు దూరంగా స్వేచ్ఛగా ఏ మాత్రమైనా మనిషి బ్రతకగలిగితే, అది బాల్యంలోనే.

ఇప్పటినించి బాధ్యత ఆ పసి మనసుకి, ఇప్పటినించీ బంధన తారతమ్యం లేకుండా చిన్న, పెద్ద అంతా సంపాదిస్తే గాని గడవని సంసారాలెన్నో? వాడి సంసారం ఎలాంటిదో?....

పాప చాలా ముద్దుగా ఉంది. ఆయన చెయ్యి పట్టుకొని జాగ్రత్తగా మెట్లెక్కించి తీసుకు వస్తున్నాడు, తెల్లటి గౌను.... విండైన కలువపువ్వులా మెరుస్తోంది. వస్తూ వస్తూ గుమ్మం దగ్గిర వాణ్ణి చూస్తూ నడిచింది. వాడూ రెండు క్షణాలు తదేకంగా చూశాడు పాపవైపు.

ఆయన కూర్చొని, పాపని పక్కన కూర్చోపెట్టుకున్నాడు. ముద్దుగా ఏదో చెబుతూంది తను తొడుక్కున్న తెల్ల గౌను గురించి. ఆయన ఇడ్లీ తెమ్మన్నాడు సర్వరుతో.

"ముందు ఇడ్లీ తినమ్మా." ప్లేటు ముందుకు తోస్తూ అన్నాడాయన. తింటూ తింటూ మళ్ళీ చెబుతూంది గౌనుమీద డిజైను గురించి.

ఆ పసిమనసుకి....ఏ ప్రత్యేకతా లేని వస్తువులు కూడా ఎంతో గొప్పవిగా కనిపిస్తాయేమో!

పాప తినేసిన ఎంగిలిప్లేటు తీయటానికి వచ్చాడు వాడు. పాప వేపు, తెల్లగౌను వేపు చూస్తూ ప్లేటు తీస్తున్నాడు. వాడి వయస్సు, పాప వయస్సు ఇంచుమించుగా ఒకటే. కాని ఇద్దరికీ....

ఠప్ అని ప్లేటు కిందపడింది. పాప గౌనునిండా చట్నీ.... ఎంగిలి నీళ్ళు. వాడి కళ్ళల్లో బెరుకు తొంగి చూస్తోంది.

"వెధవ! ఒళ్ళు దగ్గిర పెట్టుకు తీయలేవూ! పిల్ల గౌనంతా పాడుచేశావు." ఆయన చెయ్యి గాలిలో విసురుగా వూగింది.

వాడి కళ్ళ నిండా నీళ్ళు తిరిగాయి. కందిన బుగ్గ చేతుల్తో రాసుకుంటూ అలాగే నిలబడ్డాడు.

నా మనస్సు చివుక్కుమంది. పాప కళ్ళల్లో నీళ్ళు....వాణ్ణి చూస్తూ ఉండిపోయింది.

"ఏడవకు పాపా, అమ్మ గౌను మారుస్తుందిలే."

ఈలోగా కౌంటరు ముందున్న అతను పరిగెత్తుకు వచ్చాడు. వాడు చూడలేక చూడలేక బెరుగ్గా తలెత్తాడు. కందిన బుగ్గమీదనించి నీళ్ళు జారి, పడుతున్నాయి మాసిన నిక్కరు మీదికి. చెడా మడా తిట్టడం మొదలుపెట్టాడు కౌంటరు ముందతను.

పాప వాణ్ణే చూస్తోంది. ఆ చిన్నారి బుగ్గలమీద ఒకటి రెండు కన్నీటిచుక్కలు జారిపోయాయి.

"రామ్మా" అంటూ తీసుకు పోయా డాయన.

పాప వెనక్కి తిరిగి....తిరిగి....వాణ్ణి చూస్తూ వెళ్ళిపోయింది.

కింద పడిన ప్లేటు తీసికొని లోపలికి వెళ్ళిపోయాడు వాడు.

వాతావరణాన్ని భరించలేక బస్సు వస్తే బాగుండు ననిపించింది.

హోటలులోనించి బయటికి వెళ్ళిపోవా లనిపించింది. కాని వెళ్ళలేక పోయాను. కారణం గురించి ఆలోచించకుండా అలాగే సిగరెట్టు కాలుస్తూ కూర్చుండి పోయాను.

ఏవేవో బస్సులు వస్తున్నాయి పోతున్నాయి. కాని నేను వెళ్ళవలిసింది మట్టుకు రాలేదు. ఎవరెవరో వస్తున్నారు వెడుతున్నారు.

వాడు మళ్ళీ వచ్చి గ్లాసులు, ప్లేట్లు తీస్తున్నాడు. కందిన బుగ్గ మీద కన్నీటి చారిక, ఉబ్బిన కళ్ళు. మామూలుగానే ప్లేట్లు తీస్తు న్నాడు. ఇదివరకుకన్నా జాగ్రత్తగా, ప్లేటు చెయ్యి జారకుండా....

అనాలోచితంగానే నా చిన్ననాటి జీవితం గుర్తొస్తోంది. బల వంతంగా మనస్సు తిప్పుకున్నాను, నలగని పువ్వులా గడిచిన నా బాల్యాన్ని వాడితో పోల్చుకోలేక.

"చిన్నతనం తిరిగివస్తే ఎంత బాగుండును!" చాలా మంది ఎప్పుడో ఒకప్పుడు కోరుకుంటారు.

చీపురు తీసుకువస్తున్నాడు మళ్ళీ. చూడాలనిపించలేదు. పిరికి తనం. ముఖం తిప్పుకున్నాను ఇంకోవైపు.

కాలుమీద తట్టాడు తీయమన్నట్టు. ఉలిక్కిపడ్డాను ఆ స్పర్శకి. తల వంచుకుని ఊడుస్తున్నాడు.

"ఒరే రంగా, మీ నాన్న వచ్చాడు ఇటురా." పిలిచాడు కౌంటరు ముందతను.

చీపురు మూలపెట్టి కౌంటరు దగ్గరికి వెళ్ళాడు.

"ఇదిగో నీ జీతం పదిహేను రూపాయలు, మీ అయ్య కిస్తు న్నాను" అన్నాడు డబ్బు రంగడి నాన్న కిస్తూ.

డబ్బు తీసుకొని వెళుతున్నానన్నట్టు చూశా డతను, కళ్ళు ఎర్రగా ఉన్నాయి.

"ఓ పావలా ఇవ్వు నాన్నా." తల వంచుకొనే నసిగాడు రంగడు.

"ఏడిశావులే ఎందుకు పావలా?"

రంగడు తల ఎత్తలేదు.

తూలుతూ వెళ్ళిపోయాడు రంగడి తండ్రి.

బరువుగా కాళ్ళు ఈడ్చుకొంటూ వెనక్కు వచ్చేసి చీపురు తీసుకున్నాడు.

ఆ చిన్నారి మనస్సులో ఏ కోరిక ఉందో, మళ్ళీ మామూలే. వాడు....ఎంగిలి ప్లేట్లూ....కేకలూ....ఊదవటం....

నిత్యం అన్ని అవసరాలూ ఏ మాత్రం శ్రమ పడకుండా గడిచేవాళ్ళు, వెధవ గానుగ బ్రతుకనుకోవడం ఎన్నోసార్లు విన్నాను.

ఎంత బీద సంసారమైతే మటుకు వాడు సంపాదించుకున్న దాంట్లో ఓ పావలా ఇస్తే ఏం పోతుందో?....ఏమో వాళ్ళ పరిస్థితులేమిటో?....

కుతూహలం మనిషిని అనవసర విషయాలు కూడా తెలుసుకునేలా చేస్తుంది. బిల్లు ఇస్తూ అతన్ని అడగకుండా ఉండలేక పోయాను.

"వచ్చింది రంగడి నాన్నేనా?"

ఔనన్నట్లు తల వూపాడు.

"వాళ్ళ సంసారం బాగా పెద్దదా? గడవటం అంత కష్టమా?"

రెండు క్షణాలు అయోమయంగా చూసి నవ్వాడతను.

"భలేవారండీ....మీరేదో చాలా ఊహాగానం చేసినట్టున్నారు, రంగడి సంసారం గురించి. రంగడు అడిగిన పావలా లక్ష్మయ్య ఇవ్వనందుకేనా?"

ఔనన్నట్లు తల వూపాను.

"అది మామూలేనండి. ప్రతీ నెలా లక్ష్మయ్య వచ్చి ఇలా తీసుకు వెళుతూంటాడు. రంగడు ప్రతీసారి అడగటం....వాడి తీరు చూశారుగా....వాడంతే...."

"మరి?...."

"ఉండండి చెబుతా. మీ రనుకున్నట్టు పెద్ద సంసార మేమీ

కాదు. మూడేళ్ళ క్రితం రంగడి తల్లి పోయింది. అంతకు ముందు వీణ్ణి ఎలా చూశారోగాని ఇప్పుడుమటుకు జరుగుతున్న విధానం ఇది. పెళ్ళాం పోయిన ఏడాదికి భద్రమ్మని చేరదీశాడు లక్ష్మయ్య. రంగడు కూడా ఇంచుమించుగా అదే సమయంలో నావగ్గిర చేరాడు. చేరిన రెండు నెలలు ఇంటిదగ్గిర ఉన్నాడేమో. తరువాత నించి ఇక్కడే. ఇక్కడే భోంచేస్తాడు. ఏదో ఒక బల్లమీద పడుకొని నిద్ర పోతాడు. లక్ష్మయ్య అప్పుడప్పుడు అడుగుతాడు, ఇంటికి రమ్మని. కాని రంగడు ఏనాడూ వెళ్ళలేదు."

"రంగడికి అక్క చెల్లెళ్ళు ఎవరూ లేరా?"

"ఎవరూ లేరండి. ఒక్కడే సంతానం. లక్ష్మయ్య భార్య పోయిన తరువాత మరీ ఇదిగా తయారయ్యాడు. ఏ పనీ తిన్నగా చెయ్యడు. సంపాదించిన రోజు సంపాదిస్తాడు. లేవినాడు లేదు. రోజూ తాగుడు. అస్తమానూ అటూ ఇటూ తిరుగుతాడు. రంగడి పరిస్థితి చూస్తే మరీ బాధగా ఉంటుంది. ఎంతమంది చెప్పినా ఇంటికి వెళ్ళడు. వాడి మనసు ఏం చెదిరిందో? ఒంటరిగా ఇక్కడే ఉంటాడు. అప్పుడప్పుడు చూసీ చూడకుండా నేనే ఏదో చిల్లర ఇస్తూంటాను. ప్రతి ఆదివారం తప్పనిసరిగా ఒక పావలా యిస్తాను. ఎంత ఇచ్చినా జీతం రోజున లక్ష్మయ్యని అడగటం మానడు. వాడు ఇవ్వడు. 'ఇవ్వనివాణ్ణి అడగటం ఎందుకురా? నన్ను అడుగు నేను ఇస్తాను' అన్నాను రెండుమూడు సార్లు."

"ఇస్తా రండీ....కాని నాన్న చేత్తో ఎప్పుడేనా?...."

ఇంక వినా లనిపించలేదు. మాట మార్చాలని "లక్ష్మయ్యకి మీరు చెప్పి చూడక పోయారా?" అన్నాను.

"నేనేమి టండీ. చనువు ఉన్నవాళ్ళం అందరం చెప్పాం—'ఏమిటీ, పాడు అలవాట్లు మానేయమని', 'కుర్రాణ్ణి చేరదీసి జాగ్రత్తగా చూసుకోమని.' కాని వింటేనా? ఎవరడిగినా ఒక్కటే సమాధానం. 'నా చేతుల్లో ఏం లేదండీ! వాడి కంతే రాసి ఉంది. ఈ అలవాట్లు నే మానలేను. మాని బ్రతికే ఓపికా లేదు."

"బ్రతికి వాణ్ణి నువ్వు ఉద్ధరించిం దేమిటి?" అని అడిగాను ఒకసారి కోపం పట్టలేక.

"ఏం ఉద్ధరించాను బాబూ? ఏం లేదు. తండ్రి అనే శవం ఒకటి ఉందనే ధైర్యం తప్ప." అన్నాడు కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ. ఆరోజు రోజూకన్న ఎక్కువ తాగి ఓ అరుగుమీద స్పృహ లేకుండా పడిపోయాడు."

బస్సు వచ్చింది. హడావిడిగా జనం ఎక్కుతున్నారు. రంగడు కనిపిస్తాడేమోనని చూశాను. "ఏమైనా డబ్బిస్తే...." నా ఆలోచనకు నాకే నవ్వు వచ్చింది. హోటలు యజమాని ఇస్తే ఎంతో, నే నిచ్చినా అంతే ఆలోచిస్తే....నేనివ్వటం ఇంకా తక్కువేమో!

బస్సులో సీటు లేదు. బ్రతిమాలగా కండక్టరు కొంత మందిని నిలబడనిచ్చాడు. బస్సులో అందరం ఒకటే. కాని కొందరికి విశ్రాంతిగా సీటు....కొందరు నిలబడటం. జీవితం అంతే నేడు మనం అనుభవించేదాని అర్హత ఏ కొలమానం ప్రకారం నిర్ణయించబడిందో రేపు అనుభవించబోయేది దేనిమీద ఆధార పడుతుందో.

ప్రస్తుతం మన కళ్ళ ముందు జరిగేవాటిని ఆలోచించి అవగాహన చేసుకోలేనప్పుడు, ఏనాటిదో....ఎక్కడిదో ఆలోచన కేం అందుతుంది?

ఖయాం అన్నది గుర్తు వచ్చింది.

"ఎక్కడినుండి వచ్చితిమొ, ఎక్కడి కేగుట కానొ
యెవ్వ రీ వికక్కమెరింగి చెప్పుటకునేర్చిన వారలు గారు."

ఎవరం చెప్పలేక పోవచ్చు. కాని ఆలోచించ లేకుండా ఉండలేం.

ఎలా జీవిస్తే శాంతి ఉంటుంది? ఏం చేస్తే జీవితంలో విలువ యింది మిగుల్చుకున్నానన్న తృప్తి మిగులుతుంది?

పరిష్కారాలు దొరక్కుండా ఉక్కిరి బిక్కిరి చేసే ఊహలు ఇంకొకళ్లతో చెప్పుకోలేం, మనలో దాచుకోలేం....

అనుభవాల్ని మరుగున వెయ్యటం కాలానికున్న అద్భుత శక్తి. ఏడేళ్ళ తరవాత మళ్లీ కడుపునొప్పి. మళ్లీ అదే పల్లెటూరి వైద్యుడిమీద నమ్మకం.

ఓపికగా వచ్చినందుకు ఫలితం దక్కలేదు. ఆనాడు నాటు వైద్యం చేసిన అతనింటికి అడగ్గానే దారి చూపించారు. కాని ఈనాడు రెండుగంటలు ఆమాకీ తియ్యవలసి వచ్చింది, అతని చావువార్త విన టానికి.

'ఎటువంటి మనిషైనా గతించిన తరవాత....'

మళ్లీ అదే కోవకి చెందిన ఆలోచన....

వూరు కొద్దిగా అభివృద్ధి అయింది. బస్సుస్టాండు దగ్గిర ఐదారు హోటళ్ళు. ఎదురుగా అదే హోటలు.

ఆనాటి సంఘటన....రంగడు....పాప....లక్ష్మయ్య ఒక్కొక్కటే గుర్తు వచ్చాయి. గబగబా వెళ్ళాను హోటల్లోకి. కౌంటరుముందతనే ఉన్నాడు.

"రండి...." గుర్తుపట్టి తీసుకువెళ్ళి కూర్చోపెట్టాడు. నాకళ్లు వెతుకుతున్నాయి, ఎవరో ముసిలివాడు వచ్చి ఎంగిలిప్లేట్లు తీస్తున్నాడు. హోటలంతా కలయజూశాను.

కుతూహలం ఆగలేదు.

"రంగడు...."

ఒక్కక్షణం అదోలా చూశాడు అతను.

"గుర్తు వచ్చిందండి-మిమ్మల్ని చూసిన గుర్తుగాని, నిజంగా మీ రెవరో గుర్తులేదు-రంగడంటే గుర్తు వచ్చింది."

"ఏడండీ రంగడు?...." లోపలికిచూస్తూ ఆత్రంగా అడిగాను.

"అబ్బే లేదండీ, వాడు వెళ్ళిపోయి రెండేళ్ళయింది."

"'ఎక్కడికి?"

'ఏమోనండీ, రెండేళ్ళక్రితం లక్ష్మయ్య ఎవ్వరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడు. వాడు వెళ్ళిన రెండు నెలలకు రంగడు

వెళ్ళిపోతున్నానని చెప్పి వెళ్ళిపోయాడు. ఎక్కడికిరా అంటే ఏ సమాధానం చెప్పలేదు. మొండిగా పట్టుపట్టి వెళ్ళిపోయాడు. వాడి తరువాత ఈ ముసిలాడు చేరాడు."

వృద్ధుడు పక్క టేబులుమీద ఖాళీగ్లాసులు తీస్తున్నాడు.

రంగడు ఎక్కడికి వెళ్ళాడో? లక్ష్మయ్య వెళ్ళినందుకే వెళ్ళిపోయాడా? ఏమో?....ఎక్కడున్నాడో? ఏం చేస్తున్నాడో?....

వాడి బాల్యమంతా అలా నిర్లిప్తంగా....బరువుగా....గడిచింది. వాడి మిగిలిన జీవితం?....

తాత చీపురు తెస్తున్నాడు. వణికే చేతులతో....తడబడే అడుగులతో....

ఈ వయస్సులో....ఈ ముసలితనంలో....

నే నెక్కిన బస్సు కదిలింది. వెనకాల అద్దంలోంచి దుమ్ములో హోటలు గుమ్మందగ్గిర తాత....మసక మసకగా కనిపిస్తున్నాడు.

అంతే! అన్నీ అసంపూర్ణమయిన మసక మసక నీడలు!

("ఆంధ్రప్రభ"లో ముద్రితము)